నమస్తే తెలంగాణ
నిజామాబాద్, సోమవారం 23 డిసెంబర్ 2024
MONDAY, DECEMBER 23, 2024

# వ్యవసాయ కూలీలకు జీవన భృతి అందించాలి

## ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

కామారెడ్డి, డిసెంబర్ 22 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ కూలీలకు రూ.12వేల జీవన భృతిని ఇవ్వాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ కృష్ణ డిమాండ్ చేశారు. కామారెడ్డిలోని స్థానిక కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కూలీలకు ఈనెల 28వ తేదీ నుంచి జీవన భృతి అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించడం అభినందించదగ్గ విషయమని, కానీ అందులో వంద రోజులు పనిచేసిన ఉపాధి కూలీలకు మాత్రమే అని నిబంధన విధించడం సరికాదన్నారు. కేవలం ఉపాధి కూలీలే కాకుండా వ్యవసాయ రంగంలో అనేక మంది పలు రకాల పనులు చేసుకొని జీవించేవారు ఉన్నారని తెలిపారు. వారందరికీ రూ.12వేల భృతిని అందజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు ప్రకాశ్, పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి సురేశ్ పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ తిప్పాపూర్ గ్రామాధ్యక్షుడిగా భరత్‌రాజ్


భరత్‌రాజ్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు

భిక్కనూరు, డిసెంబర్ 22: మండలంలోని తిప్పాపూర్ గ్రామ ఎమ్మార్పీఎస్ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు కర్రోళ్ల రాజు తెలిపారు. గ్రామానికి చెందిన భరత్ రాజ్ అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా రజినీకాంత్, ఉపాధ్యక్షులుగా మహేశ్, సురేశ్ ఎన్నికయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు ఆయన నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాజేందర్, బాబు, సుమంత్, స్వామి, సతీశ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

# తరగతులు ఐదు.. గది ఒక్కటే..

- సర్కారు బడిలో సమస్యలు ఎన్నో..
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు


కేవులానాయక్ తండాలో ఒకే గదిలో చదువుకుంటున్న ఐదు తరగతుల విద్యార్థులు



కేవులానాయక్ తండా ప్రాథమిక పాఠశాల

**ఐదు తరగతులకు ఒకే గది.** ఇద్దరు ఉపాధ్యాయులు, 16 మంది విద్యార్థులు. స్టాఫ్‌రూం, స్టోర్ రూం కూడా ఆ గదిలోనే. ఇది బాన్సువాడ మండలం కొయ్యగుట్ట తండా గ్రామ పంచాయతీ పరిధిలోని కేవులానాయక్ తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల దీన స్థితి. తరగతి గదులు లేక ఒకటి నుంచి ఐదు తరగతులకు చెందిన విద్యార్థులకు ఒకే గదిలో ఉపాధ్యాయులు పాఠాలను బోధిస్తున్నారు. ఈ గదిలో ఐదు తరగతులు కొనసాగుతుండడంతో చదువుకునేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరిపడా తరగతి గదులు లేక తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలకు పంపిస్తున్నారు. ఆ ఒక్క గదినే ఉపాధ్యాయులు స్టాఫ్‌రూమ్, స్టోర్‌రూమ్‌గా వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది.

–బాన్సువాడ రూరల్, డిసెంబర్ 22

# జంగంపల్లి పెద్ద చెరువు నీటి విడుదల

భిక్కనూరు, డిసెంబర్ 22: మండలంలోని జంగంపల్లి గ్రామ పెద్ద చెరువు నీటిని అఖిల పక్షం నాయకులు, గ్రామ పెద్దలు కలిసి ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా తూము వద్ద ప్రత్యేక పూజలు చేశారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని చెరువు ఆయకట్టు రైతులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు నర్సింహులు యాదవ్, డీసీసీబీ డైరెక్టర్ సిద్ధరాములు, విండో వైస్ చైర్మన్ వాసు యాదవ్, వీడీసీ చైర్మన్ శివలింగం, రైతు సంఘం నాయకుడు వెంకట్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మమత, సత్యం, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షులు బాల్ చంద్రం, సార్గ నరేశ్, కుమ్మరి నరేందర్, రైతులు సార్గ రాములు, రామస్వామి, రమేశ్, పోచయ్య, మెంగని స్వామి, గుండ శేఖర్, అంజయ్య, నాయకులు దార శేఖర్, రవి, బాబు తదితరులు పాల్గొన్నారు.


చెరువు నీటిని విడుదల చేస్తున్న అఖిలపక్షం నాయకులు

## అపూర్వ సమ్మేళనం

కామారెడ్డి, డిసెంబర్ 22: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. 20ఏండ్ల అనంతరం ఒకరినొకరు కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కుటుంబ వివరాలు, యోగక్షేమాలు తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.


సమ్మేళనంలో పాల్గొన్న 2004–05 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

## గణిత ఉపాధ్యాయుడికి సన్మానం



సన్మానం అందుకుంటున్న రామకృష్ణ

కామారెడ్డి, డిసెంబర్ 22: తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డిలోని బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న గణిత విషయ నిపుణుడు విజయగిరి రామకృష్ణను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ఎస్ఈ ఈఆర్టీ డైరెక్టర్ రమేశ్, ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి కలిసి సన్మానించారు. కార్యక్రమంలో టీఎంఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కందికొండ శ్రీనివాస్, రాష్ట్ర అకాడమిక్ కౌన్సిలర్ శ్రీధరాచార్యులు, జిల్లా అధ్యక్షుడు వేణు గోపాల్, కార్యదర్శి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ

బీబీపేట్, డిసెంబర్ 22: మండల కేంద్రంలోని శ్రీగాధ రోడ్డులో ఎస్సై ప్రభాకర్ ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ రాజయ్య, పోలీసు సిబ్బంది కలిసి ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సరైన ధ్రువ పత్రాలు లేని 30మంది వాహనదారులకు జరిమానా విధించారు. వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు సూచించారు. అన్ని ధ్రువ పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రంజిత్‌గౌడ్, రవీందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### మున్నూరుకాపు మండల యూత్ కార్యవర్గం ఎన్నిక

రామారెడ్డి, డిసెంబర్ 22 : మండల కేంద్రంలో మున్నూరు కాపు మండల యూత్ కమిటీని మండల అధ్యక్షుడు కడెం శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. మండల యూత్ అధ్యక్షుడిగా నేరెళ్ల నాగరాజు, గౌరవ అధ్యక్షుడిగా నరేశ్, ఉపాధ్యక్షుడిగా ముదాం హరీశ్, సెక్రటరీగా గోపు రంజిత్, క్యాషియర్‌గా ఆకుల సురేశ్, మండల కో–ఆర్డినేటర్‌గా సుధాకర్‌ను ఎన్నుకున్నారు.

### 50 శాతం సర్వే పూర్తి

లింగంపేట, డిసెంబర్ 22: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ గృహాల సర్వే 50 శాతం పూర్తయినట్లు ఎంపీడీవో నరేశ్ ఆదివారం తెలిపారు. 41 పంచాయతీల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ గృహాల కోసం ప్రజాపాలన గ్రామసభల్లో 12,179 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఆదివారం నాటికి 6,194 దరఖాస్తుల సర్వే పూర్తయిందని, పూర్తయిన దరఖాస్తుల వివరాలు వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు వివరించారు.

### పగలూ.. వెలుగుతూనే..


గండిమాసానిపేట్ గేట్ వద్ద వెలుగుతున్న దీపాలు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 22: మున్సిపల్ పరిధిలోని గండిమాసానిపేట్ గేట్ వద్ద ఏర్పాటుచేసిన సెంట్రల్ లైటింగ్ దీపాలు సమయానుకూలంగా కాకుండా 24 గంటలూ నిర్విరామంగా వెలుగుతూ ఉన్నాయి. రాత్రి సమయంలో లైట్లు వేసి ఉదయాన్నే స్విచ్ఛాఫ్ చేయాల్సిన మున్సిపల్ సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండడంతో సెంట్రల్ లైటింగ్ దీపాలు రాత్రింబగళ్లు వెలుగుతూనే ఉంటున్నాయి. రాత్రి వేళల్లో మాత్రమే వెలిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

### రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


సుచరిత, ఉషా

గాంధారి, డిసెంబర్ 22: రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు మండలంలోని పేట్‌సంగెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు సుచరిత, ఉషా ఎంపికైనట్లు పాఠశాల పీడీ లక్ష్మణ్ రాథోడ్ ఆదివారం తెలిపారు. ఇటీవల కామారెడ్డిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని, వీరిని నిర్వాహకులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జట్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 23 నుంచి హైదరాబాద్‌లోని హకీంపేట్ స్పోర్ట్స్ పాఠశాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ఆడనున్నట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

EDUCATION

★రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. J S అకాడమి (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337306

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు.. నెట్‌వర్క్ ఇబ్బందులు

- నత్తనడకన సర్వే
- ఇప్పటి వరకు 30 శాతమే పూర్తి
- క్షేత్రస్థాయిలో ఇబ్బందులు పడుతున్న గ్రామ కార్యదర్శులు

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 22: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సర్వే గ్రామ కార్యదర్శులకు ఇబ్బందులను తెచ్చి పెట్టింది. మారుమూల గ్రామాలు, గిరిజన తండాల్లో..నెట్‌వర్క్ ఇబ్బందులతో సర్వే ముందుకు సాగడం లేదని గ్రామ కార్యదర్శులు పేర్కొంటున్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే బాధ్యతలను ఆయా గ్రామాల కార్యదర్శులకు అప్పగించారు. సర్వే ప్రారంభమై చాలా రోజులు కావస్తున్నా మండలంలో ఇప్పటి వరకు 30 శాతం మాత్రమే సర్వే పూర్తి చేశారు. మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉండగా..అందులో 7,764 కుటుంబాలు ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్నాయి. అందులో ఇప్పటి వరకు 2,400 కుటుంబాల వివరాలు మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. కాగా క్షేత్ర స్థాయిలో గ్రామ కార్యదర్శులు నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారుమూల గ్రామాలు, తండాల్లో..కుటుంబ సభ్యుల వివరాలు ఎంట్రీ చేసేందుకు సైతం నెట్‌వర్క్ ఇబ్బందులతో ముందుకు వెళ్లడం లేదని, సిగ్నల్ కోసం ఎత్తయిన ప్రాంతాల్లోకి వెళ్లి అప్‌లోడ్ చేయాల్సి వస్తున్నదన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామాల్లో ఉండి సర్వే చేపట్టినా 10 మందివి కూడా కావడం లేదనీ..కొన్ని సార్లు అసలు యాప్ సర్వర్ పని చేయకపోడంతో ఖాళీగా ఉండవలసి వస్తున్నదన్నారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఇలా ఉంటే అధికారులు సర్వే త్వరగా పూరి చేయాలంటూ చెబుతున్నారనీ, తమ బాధలు ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెలవు దినాల్లో సైతం గ్రామాల్లో ఉండి సర్వే చేపడుతున్నామని చెబుతున్నారు. రోజు వారీ విధుల్లో పాల్గొంటూనే సర్వే చేపట్టడం అందులో సర్వర్, ఆన్‌లైన్ ఇబ్బందులతో, ఉద్యోగం అంటేనే భయమేస్తున్నదని ఆవేదన చెందుతున్నారు. అధికారులు తమ ఇబ్బందులను గుర్తించాలని కోరుతున్నారు.


ధర్మారెడ్డిలో సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారిణి రత్నం

### సర్వర్, నెట్‌వర్క్‌తో ఇబ్బందులు ..



ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో యాప్ సర్వర్, నెట్ వర్క్ ఇబ్బందులతో సర్వే మందకొడిగా జరుగుతున్నది. కొన్ని సార్లు యాప్ సర్వర్ పని చేయడం లేదు. మారుమూల గ్రామాలు, గిరిజన తండాల్లో నెట్‌వర్క్ ఇబ్బందులతో సర్వేకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

–తిరుపతి, గ్రామ కార్యదర్శి, పోచారం

### సిగ్నల్ కోసం వెతుక్కోవాల్సి వస్తున్నది..



మండలంలోని మారుమూల గ్రామాలు, తండాల్లో యాప్ సర్వర్, నెట్ వర్క్ ఇబ్బందుల వల్ల సర్వే వేగంగా ముందుకు సాగడం లేదు. వారం రోజుల్లో కేవలం 30 శాతం మాత్రమే సర్వే పూర్తి చేశాం. సర్వే కోసం గ్రామంలో సిగ్నల్ కోసం వెతుక్కోవలిసి వస్తున్నది. విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

–ప్రభాకర్, ఎంపీడీవో, నాగిరెడ్డిపేట

## కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 22: మండల కేంద్రం గోపాల్‌పేటలో నూతన రహదారి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రం కోదండ రామాలయం నుంచి పోచారం ప్రధాన కాలువ వరకు రెండు కిలోమీటర్ల దూరం వరకు రహదారికి ఇరువైపులా సైడ్ డ్రైన్ పనులు సగం వరకు పూర్తి చేశారు. సర్వీస్ రోడ్లకు మట్టివేసి కంకరతో రోలింగ్ పనులు పూర్తి చేస్తున్నారు. పనులు వేగంగా కొనసాగుతుండడంతో మండల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలను తొలగించకపోవడంతో..పనుల్లో జాప్యం జరుగుతున్నదని అధికారులు అంటున్నారు. అనుకున్న ప్రకారం పనులు ముందుకు సాగితే, నెల రోజుల్లో సర్వీస్‌రోడ్డు పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామని హైవే అధికారులు పేర్కొంటున్నారు.


గోపాల్‌పేటలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న మట్టిని తొలగిస్తున్న పొక్లెయిన్

## పాఠశాలలకు చేరని రాగిపిండి సంచులు

### ఆన్‌లైన్ చేసేవారు లేక ఎమ్మార్సీలో మూలుగుతున్న వైనం..


నాగిరెడ్డిపేట మండల విద్యావనరుల కేంద్రంలో నిల్వ ఉన్న రాగి జావ పిండి సంచులు

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 21: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న రాగి జావ పిండి మండల విద్యా వనరుల కేంద్రంలో మూలుగుతున్నది. ప్రతి నెల పాఠశాలకు చెందిన రాగి జావ పిండి సంచులు మండల కేంద్రంలోని ఎమ్మార్సీకి వస్తున్నాయి. ఎమ్మార్పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు వివరాలను ఆన్‌లైన్, రికార్డుల్లో రాసుకొని పాఠశాలల వారీగా ప్రధానోపాధ్యాయులకు అందజేస్తారు. కాగా ఈనెల వచ్చిన సంచులు సిబ్బంది సమ్మెలో ఉండడంతో కార్యాలయం లోనే మూలుగుతున్నాయి. ఈ విషయంపై ఎంఈవో భాస్కర్‌రెడ్డిని వివరణ కోరగా..వాటి వివరాలను పాఠశాలల వారీగా ఆన్‌లైన్ చేసిన తర్వాత పంపిణీ చేస్తామన్నారు. ఈనెల 10 నుంచి సిబ్బంది సమ్మెలో ఉండటంతో..పనులు ముందుకు సాగడం లేదన్నారు.

## 1930 నంబర్‌పై అవగాహన కలిగిఉండాలి

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 22: 1930 నంబరు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని, అవగాహన కలిగి ఉండాలని ఎస్సై బొజ్జ మహేశ్ సూచించారు. ఆదివారం ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మన ప్రమేయం లేకుండా మన ఖాతాలో నుంచి డబ్బులు ఖాళీ అవుతుంటే 1930కి ఫోన్ చేసి సమాచారం అందివ్వాలన్నారు. వెంటనే కేంద్ర సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ రంగంలోకి దిగి సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టం సిబ్బందికి సమాచారం ఇచ్చి ఏ రాష్ట్రంలో మోసం జరుగుతుందో ఆ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో సమాచారం ఇస్తుందన్నారు. వారి ద్వారా అకౌంట్ నుంచి డబ్బులను డ్రా చేయకుండా పుట్ ఆన్ హోల్డ్ చేయిస్తామన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడపొద్దు

లింగంపేట, డిసెంబర్ 22: మద్యం తాగి వాహనాలు నడిపితే వాహనదారులను జైలుకు పంపుతామని ఎస్సై సుధాకర్ వాహనదారులను హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట ఆదివారం సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకు పంపుతామన్నారు. అలాగే వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను వెంటనే చెల్లించాలని, లేనియెడల వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

## బాధిత కుటుంబాలకు చెక్కుల అందజేత


ఎల్లారెడ్డి క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబాలకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 22: విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చెక్కులను ఆదివారం అందజేశారు. గాంధారి మండలం గండివేట్, రాజంపేట్ మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వారు విద్యుత్ ప్రమాదంలో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులకు విద్యుత్‌శాఖ తరఫున మంజూరైన రూ.5లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు సాయిబాబు, నాయకులు గయాజొద్దీన్, తిరుపతి తదితరులున్నారు.

## 'అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి'

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 22: పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై వ్యంగంగా మాట్లాడిన అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ ఎల్లారెడ్డి పట్టణ అధ్యక్షుడు మర్లు సాయిబాబు అన్నారు. ఆదివారం ఆయన ఎల్లారెడ్డిలో మాట్లాడుతూ.. కేంద్ర హోం మంత్రి పదవిలో ఉన్న అమిత్‌షా పార్లమెంట్‌లో అంబేద్కర్ అంబేద్కర్ అంబేద్కర్ అని అనడం ఈ మధ్య ఫ్యాషన్ అయిపోయిందని, అందుకు బదులుగా దేవుని నామస్మరణ చేస్తే ఏడు జన్మలకు స్వర్గం ప్రాప్తిస్తుందనడం .. అంబేద్కర్‌పై వ్యతిరేక నిజస్వరూపం బయటపడిందన్నారు. అమిత్‌షా దేశప్రజలకు క్షమాపణ చెప్పి, తమ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## గుండెపోటుతో వ్యక్తి మృతి

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 22: మండల కేంద్రం గోపాల్‌పేటకు చెందిన మహ్మద్ నజీర్(46) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికంగా టీవీ రిపేరింగ్ దుకాణం నడిపే నజీర్ ఆదివారం ఉదయం గుండెపోటుకు గురికావడంతో..స్థానిక ప్రైవేట్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పలువురు వ్యాపారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసి వేశారు. ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో అంత్యక్రియల్లో పాల్గొన్నారు.